ఔట్‌ఫాల్ డ్రెయిన్లలో పారని మురుగు

- అసంపూర్తిగా నిలిచిన ఊర్మిళానగర్ డ్రెయిన్
- బైపాస్ రోడ్డు పక్కన డ్రెయిన్‌పై అక్రమ నిర్మాణాలు
- నిలిచిన మురుగుతో ప్రజల ఇక్కట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గం 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్ ఔట్ ఫాల్స్ డ్రెయిన్లలో మురుగు పారడం లేదు. ఊర్మిళానగర్ మెయిన్ రోడ్డుకు తూర్పు వైపున దశాబ్దాల క్రితం నిర్మించిన ఔట్‌ఫాల్ డ్రెయిన్ ఓ వైపు వాల్ దెబ్బతింది. దీంతో మురుగు నీరు పక్కనున్న ఖాళీ స్థలాల్లోకి ప్రవహిస్తోంది. ఈ డ్రెయిన్‌కు అనుకుని ఉన్న చర్చి ప్రహరీ వరదల సమయంలో రెండు చోట్ల కూలిపోయింది. దీంతో కొద్దిపాటి వర్షానికి డ్రెయిన్ పొంగి చర్చిలోకి మురుగు నీరు చేరుతోంది. ఖాళీ స్థలాలు ఉన్న చోట డ్రెయిన్‌లోకి పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. ఓ వైపు వాల్ కూడా లేకపోవడంతో మురుగు పక్కన ఇళ్లలోకి వెళుతోంది. ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు నుంచి బైపాస్ రోడ్డు పక్కగా చర్చి సెంటర్ వరకు నిర్మించిన ఔట్‌ఫాల్ డ్రెయిన్ స్వరూపమే లేకుండా పోయింది. ఈ డ్రెయిన్‌పై మెయిన్ రోడ్డు వెంబడి షాపులు నిర్మించారు. దీంతో డ్రెయిన్‌లో మురుగు ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. చర్చి సెంటర్ వద్ద దుకాణాలన్నీ ఈ డ్రెయిన్‌పైనే ఉన్నాయి. ఇక చర్చి సెంటర్ వద్ద క్రాంబే రోడ్డు నుంచి వచ్చే డ్రెయిన్, న్యూ హెచ్‌బీజీ నుంచి వచ్చే డ్రెయిన్ కలిసి ఊర్మిళానగర్ వైపు ప్రవహిస్తాయి. ఈ మూడు కలిసిన చోట డ్రెయిన్‌పై సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది.


పడమర డ్రెయిన్‌లో నిలిచిన మురుగు


స్కూల్ ముందు కాలువలో నిల్వ ఉన్న చెత్త


అస్తవ్యస్తంగా తూర్పు డ్రెయిన్

రక్షణ కరువు

ప్రధాన రహదారిలో ఉన్న ఈ డ్రెయిన్‌పై రక్షణగా సిమెంట్ రాళ్లు ఏర్పాటు చేయలేదు. రోడ్డుకు ఇరు వైపులా ఉన్న వాళ్లు తమ ఇళ్ల ముందు సొంతంగా డ్రెయిన్‌పై దిమ్మెలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు తాత్కాలికంగా ఇనుప రేకులు, తలుపు చెక్కలు ఏర్పాటు చేసుకుని డ్రెయిన్ దాటుతున్నారు. పెద్దలు, చిన్నారులు ఉన్న ఇళ్ల వారు ఇబ్బందులు పడుతున్నారు. పైగా దీనిలో మురుగు బాగా నిలిచిపోయి ఉంది. చెత్తా చెదారం చేరి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి తోడు రెండు నెలల క్రితం వచ్చిన వరదలకు ఈ డ్రెయిన్ నిండా పూడిక చేరింది. వీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోయింది. ఏ చిన్న వర్షం పడినా డ్రెయిన్ పొంగి రోడ్డుపై చేరుతోంది. అసంపూర్తిగా నిలిచిన చోట అయినా సిద్దం కృష్ణారెడ్డి స్కూల్ వద్ద నుంచి ఈ డ్రెయిన్‌ను తూర్పు డ్రెయిన్‌లో కలిపి వేశారు. ఈ డ్రెయిన్ వెడల్పు ఎక్కువగా ఉండడం, తూర్పు డ్రెయిన్‌లో కలిపేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ పైపులు చిన్నవి కావడంతో మురుగు వెనక్కు పారుతోంది. ఇక స్కూల్ ఎదురుగా డ్రెయిన్‌లో మురుగు నిలిచిపోవడం, చెత్త పేరుకుపోవడంతో పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వాసన భరించలేకపోతున్నామంటున్నారు. వరదల తర్వాత ఇక్కడ సిల్ట్ తొలగించిన పాపాన పోలేదు.

అసంపూర్తిగా పడమర డ్రెయిన్

ఊర్మిళానగర్ మెయిన్ రోడ్డు కొద్దిపాటి వర్షానికి జలాశయాన్ని తలపించేది. ఊర్మిళానగర్‌లోని పలు కాలనీల్లో డ్రెయిన్‌లన్నీ మెయిన్ రోడ్డుకు వచ్చి చేరేవి. దీంతో మెయిన్ రోడ్డు అధ్వానంగా మారింది. ఇక్కడ మురుగు సమస్య పరిష్కరించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్చి సెంటర్ నుంచి ఊర్మిళా నగర్ చివర కబేళాకు వెళ్లే రోడ్డు వరకు మెయిన్ రోడ్డు పడమర ఔట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టింది. దీని నిర్మాణానికి మున్సిపల్ సాధారణ నిధులు రూ.1.14 కోట్లు కేటాయించింది. మూడొంతుల నిర్మాణం కూడా పూర్తి చేసింది. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ఇతర ఇబ్బందుల కారణంగా నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

డ్రెయిన్లతో భయమేస్తోంది



పడమర ఔట్‌ఫాల్ డ్రెయిన్ వెడల్పు, లోతు ఎక్కువగా ఉంది. దీనిపై రక్షణకు సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయలేదు. పైగా సగానికి పైగా మురుగు నీరు నిలిచి ఉంది. బాగా దుర్వాసన వస్తోంది. చెత్తా చెదారం పేరుకుపోయింది. దీంతో దోమలు పెరిగాయి. ఈ డ్రెయిన్ పూర్తి చేస్తే ఊర్మిళానగర్ కాలనీల్లో నీరంతా డ్రెయిన్ ద్వారా బయటకు వెళుతోంది. ఇప్పుడు ఆ అవకాశం లేదు. దీంతో ఎక్కడ మురుగు అక్కడ నిలిచిపోయింది. నిత్యం స్కూల్ పిల్లలు, వృద్ధులు అటు ఇటు వెళ్తుంటారు. అదుపు తప్పి పడిపోతారేమోనని భయమేస్తోంది. పూర్తయిన డ్రెయిన్ వరకు పైన సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయాలి.

– భవాని, స్థానికురాలు, ఊర్మిళానగర్

క్లుప్తంగా

మౌలిక వసతుల ఏర్పాటుపై అశ్రద్ధ వద్దు



పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు వీఎంసీ అందిస్తున్న మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం మాచవరం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కొండపై నుంచి వచ్చే వ్యర్థాలు కింద పేరుకుపోవడం గమనించి, వెంటనే డి సిల్టింగ్ పనులను మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని రోడ్డుపై అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మూత సరిగ్గా లేకపోవడం గమనించి సత్వరమే మూతను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఇంజినీర్ పి.సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.20 లక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయమైన పాతబస్తీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.4,20,016ల ఆదాయం లభించినట్లు కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు తెలిపారు. సుమారు ఏడు మాసాలకు హుండీల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. దానవాయి సత్రం కార్యనిర్వహణాధికారి మోహన్ దేవదాయ శాఖ పక్షాన పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. హుండీ కానుకల లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మల్లేశ్వరుడికి చందనాలంకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, అర్చన, అలంకరణలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. అర్చకులు సహస్ర లింగాలకు పంచామృతాలతో అభిషేకాలు అనంతరం బిల్వాలతో అర్చన చేశారు. అనంతరం స్వామి వారికి కాగడా మల్లెలు, గన్నేరు పూలు, చందనంతో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్లకు దీపార్చన సేవ జరిగింది. భక్తులు, ఉభయదాతలు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది ఊంజల సేవలో పాల్గొని తరించారు.

గాయత్రీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పాత శివాలయంలో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు గురువారం శ్రీ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్షదీక్షా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

డిసెంబరు 28, 29 తేదీల్లో 'యువగళ సమ్మేళనం'

విజయవాడ కల్చరల్: కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 28, 29 తేదీల్లో విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలో యువతకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 40–45 లోపు వారికి యువగళ సమ్మేళనం, కవితా వైభవ సభను నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కవిత, గేయం, లలిత గేయం, గజల్, పద్యంలో స్వీయ కవితా గానం చేయవచ్చని రుసుము చెల్లించవలసిన అవసరం లేదని రాత ప్రతిని నవంబరు 30వ తేదీలోపు 9440 167 697, 944 178 2642 నంబరుకు పంపాలని కోరారు. కవి సమ్మేళనంలో పాల్గొనేవారు తాము చదుకొనే పాఠశాల నుంచి ధ్రువపత్రం తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు.

వైభవంగా కావడి మహోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో కావడి మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. కొత్తపేట ఇంద్రకీలాద్రిపై కొలువున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్కంద షష్ఠి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కావడి మహోత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా కృష్ణానదిలో పవిత్ర స్నానాలను ఆచరించి భక్తులు కావడులను ధరించి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. భక్తులు వారు మొక్కుకున్న పాలకావడి, చందన కావడి వంటి వివిధ కావడులతో ఆలయానికి చేరుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించగా స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

వీఎంసీ సమీక్ష సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని, కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం నగరాభివృద్ధికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయన మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, వివిధ శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగరంలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో చేపట్టిన అభివృద్ధి పనులు, డ్రెయినేజీ విధానం, తాగునీటి సరఫరా, స్టేడియం అభివృద్ధికి అవసరమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ భవిష్యత్‌లో నగరం వరద ముంపునకు గురి కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో కొండ ప్రాంతాలలోని ప్రజలకు మంచి నీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుని 24 గంటలూ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. స్టేడియం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్, ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జీ సృజన, డెప్యూటీ డైరెక్టర్ (హార్టీకల్చర్) రామ్మోహన్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జీఎఫ్‌సీ 7 స్టార్ దరఖాస్తుపై అభ్యంతరాల స్వీకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో చెత్తను సమయానికి సేకరించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నందున విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో జీఎఫ్‌సీ 5 స్టార్ సర్టిఫికేషన్ సాధించింది. ఈ నేపథ్యంలో 2024లో జీఎఫ్‌సీ 7 స్టార్ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేస్తున్నందున ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ ప్రకటన జారీ చేసిన రోజు నుంచి 10 రోజులలోపు తెలియజేయాలని ఈ మేరకు నగరపాలక సంస్థ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అభ్యంతరాలను 81819 60909 నంబర్‌కు తెలియజేయాలని కోరింది.

సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: గీతాంజలి మ్యూజికల్, ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సినీ నటుడు చిరంజీవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన సందర్భంలో గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి, కళాకారులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వేటూరి పాటల సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ స్వయం కృషితో అందరివాడనిపించుకున్న నటుడు చిరంజీవి అని అభివర్ణించారు. చిరంజీవి ఐబ్యాంక్ ద్వారా సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు ఆధ్వర్యంలో రామభద్ర కుమార్, రవికుమార్, రూపశ్రీ, మోహన, భావన చిరంజీవి నటించిన చిత్రాలలోని పాటలను ఆలపించారు. వివిధ సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, పరుచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

200 మంది భక్తులకు అన్నప్రసాదం

విజయవాడ కల్చరల్: పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం రెండువందల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా దేవి, వెన్నవల్లి వెంకట వీర నాగశ్రీనివాస్, కావ్య, వెంకట శివకృష్ణ శ్రీకాంత్, శ్రీదేవి, శశిదేవి పాల్గొన్నారు. దేవాలయ అర్చకుడు మురళీకృష్ణ స్వామి కార్తిక మాస వైభవం అంశంగా ప్రసంగించారు. శివనామ స్మరణ భక్తిముక్తి దాయకమని తెలిపారు. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలోనూ, శృంగేరీ పీఠపాలిత శివరామ కృష్ణ క్షేత్రంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర పాఠశాలల జాతీయ పోటీలకు ఏర్పాట్లు పూర్తి


ట్రోఫీలను ఆవిష్కరించిన దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: మౌంట్ ఫోర్ట్ హైదరాబాద్ రీజియన్ అంతర పాఠశాలల జాతీయ పోటీలను నగరంలోని ఎస్ఎస్ఎం స్కూల్‌లో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి తెలిపారు. మౌంట్ జెనిత్-2024 పేరుతో 35వ జాతీయ క్రీడలను రీజియన్ పరిధిలోని మౌంట్ ఫోర్ట్ స్కూల్స్‌లో చదివే 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్నామని స్కూల్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం వెల్లడించారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో జరిగ పోటీలకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాల్లోని 30 పాఠశాలల నుంచి 1,500 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. క్రీడాకారులకు పాఠశాలలోనే వసతి కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, కరస్పాండెంట్ బ్రదర్ మాంటి, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రియాంక పాల్గొన్నారు. అనంతరం ట్రోఫీలను ఆవిష్కరించారు.

11, 12 తేదీల్లో సర్వోత్తమలో విద్యార్థులకు పోటీలు

పటమట(విజయవాడతూర్పు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యంలో నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు నవంబర్ 11,12 తేదీల్లో వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయం కార్యదర్శి డాక్టర్ రావి శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖనం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, జ్ఞాపక శక్తి, పద్య పఠనం, బుక్ హంట్‌లపై పోటీ లు జరుగుతాయని వివరించారు. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని సబ్ జూనియర్లకు (1 నుంచి 4 తరగతులు) 11వ తేదీ ఉదయం 10 గంటలలకు తాము ఇచ్చిన కథకు బొమ్మ వేయటం, 12వ తేదీ ఉదయం 10 గంటలకు మేము ఇచ్చిన అంశంపై కథ చెప్పడంలో పోటీలు ఉంటాయని తెలిపారు. జూనియర్లకు (5 నుంచి 7 తరగతులు) 11వ తేదీ ఉదయం 10 గంటలకు తాము ఇచ్చిన పుస్తకానికి సమీక్ష, 12వ తేదీ ఉదయం 10 గంటలకు 5వ తరగతి వారికి జ్ఞాపకశక్తిపై, 6వ తరగతి వారికి దాశరథి పద్యం, భావం చెప్పడం, 7 వ తరగతి వారికి బుక్ హంట్ పైనా పోటీలుంటాయని వివరించారు. సీనియర్లకు (8 నుంచి 10 తరగతులు) 11వ తేదీ 10 గంటలకు తాము ఇచ్చిన పుస్తకానికి సమీక్ష రాయటం, 12వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు తాము ఇచ్చిన అంశంపై కథ రాయటంపై పోటీలుంటాయని, ప్రతి పోటీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని తెలిపారు. నగరంలోని అన్ని ప్రైవేట్, మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలు సర్వోత్తమ గ్రంథాలయంలోగానీ, 79953 13148 నంబర్‌లోగానీ తెలుసుకోవచ్చని తెలిపారు.

ఔత్సాహిక కళాకారులతో గజ్జె పూజ


గజ్జె పూజ కార్యక్రమంలో చిన్నారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కూచిపూడి నాట్య సంప్రదాయంలో ప్రధాన అంశమైన గజ్జె పూజను ఔత్సాహిక కళాకారులైన చిన్నారులతో గురువారం ఘనంగా నిర్వహించారు. భవానీపురం లలితానగర్‌లోని జేఎంఎస్ నాట్య వేద అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచార్యులు గురువులు జంగం విజయ్ కుమార్, మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి మార్గ నిర్దేశకత్వంలో గురువారం చిన్నారులతో పూజాదికాలు చేయించారు. అనంతరం చిన్నారులకు వారు మువ్వల గజ్జెలను ధరింప చేశారు. నాట్యాచార్యుడు మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్య కళాకారిణి జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టాలలో గజ్జె పూజ ఒకటన్నారు. నర్తకి నటరాజు భగవానుడు, ఆ తరువాత గురువు నుంచి ఆశీర్వాదం కోరుతుందన్నారు. అనంతరం ఆమె గజ్జెలను ధరించే ముందు వాటిని ప్రార్థిస్తూ మంచి కళాకారిణిగా గుర్తింపు పొందాలని కోరుకుంటుందని చెప్పారు. నాట్యం చేసేటప్పుడు కాలికి ఉన్న గజ్జెలు ఘల్లు.. ఘల్లు మంటూ లయబద్ధంగా మోగుతుంటే ఆ నర్తకి మనసు ఉప్పొంగి నాట్యం చేస్తుందని, ఆ సమయంలో వారి హావభావాలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. నృత్యం మనిషికి మంచి శారీరక వ్యాయమమని, అదే సమయంలో వారి మానసిక వికాసానికి దోహద పడుతుందని పేర్కొన్నారు. కూచిపూడి, భరత నాట్యం అంశాలలో చక్కని అభినయాన్ని ప్రదర్శించడం ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు.

దోపిడీ లేని సమాజానికి పాటుపడాలి


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రష్యా విప్లవ దినోత్సవం స్ఫూర్తితో దోపిడీ లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని సీపీఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు పిలుపునిచ్చారు. రష్యా విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో పతాకావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, ఆ పార్టీ సీనియర్ నేత పిళ్లా రాంబాబు పతాకాన్ని ఆవిష్కరించారు. బోయి సత్యబాబు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటిసారి సోషలిస్టు విప్లవం సోవేట్ యూనియన్ సాధించడం ద్వారా దోపిడీ లేని, అసమానతలు లేని సమాజాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.సూరిబాబు, ఈవీ నారాయణ, పి.సూరిబాబు, అప్పన్న, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో 'కార్తిక' ఉత్సవాలు



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 11వ తేదీ సోమవారం నుంచి 17వ తేదీ శనివారం వరకు నగరంలోని కామకోటినగర్ శంకర మఠం, జగ్గయ్యపేట లో మనగుడి కార్యక్రమంలో భాగంగా కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మప్రచార పరిషత్ కోస్తా జిల్లాల సూపరింటెండెంట్ మేడవరం క్రాంతికుమార్ తెలిపారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. 11వ నుంచి 17వ తేదీ వరకు కామకోటి నగర్ శంకర మఠంలో ఐదురోజుల పాటు కార్తిక మాస వైభవం అంశంగా ఆధ్యాత్మిక ప్రసంగం జరుగుతుందని తెలిపారు. ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ 13వ తేదీ రాజీవ్‌నగర్‌లోని రామాలయంలో, జగ్గయ్యపేట బండిపాలెంలో తులసి మొక్కల పంపిణీ, 15వ తేదీ గుణదల పడవల రేవులోని శివాలయంలో మంగళ కైశిక ద్వాదశి వ్రతం సామూహికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో హిందూ ధర్మప్రచార పరిషత్ బాధ్యులు బొగ్గవరపు బాల కోటేశ్వరరావు, నందూరి వెంకట తాండవ కృష్ణ, సంకుల సత్యతులసి పాల్గొన్నారు. వివరాల బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో ధర్మపథం వేదికపై కె.నళిని శిష్యబృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని ఆద్యంతం భక్తులు ఎంతో ఆసక్తితో వీక్షించి, వారిని అభినందించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.